
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక



ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 23 | సోమవారం 26 జనవరి 2026 | పేజీలు : 4 | వెల : 3/-









- అమరావతిలో తొలిసారి గణతంత్రదిన వేడుకలు..
- భద్రతా దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించిన గవర్నర్
- అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభుత్వం సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందన్న అబ్దుల్ నజీర్
- 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ప్రణాళికలు అమలు చేస్తున్నామని వెల్లడి


# ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి


**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

రాష్ట్ర స్థాయి 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను రాజధాని అమరావతి నేలపాడులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవనీయులు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పెరేడ్‌ను పరిశీలించి, తన సందేశాన్ని అందించారు. వేడుకల్లో ఇండియన్ ఆర్మీ, కర్నూలు ఏపీఎస్పీ సెకండ్ బెటాలియన్, సీఆర్పీఎఫ్, కేరళ రాష్ట్ర పోలీస్, విశాఖపట్టణం ఏపీఎస్పీ 16 వ బెటాలియన్, ఎన్సీసీ (బాయ్స్), ఎన్సీసీ (గరల్స్), - మిగతా3లో

## భిన్నత్వంలో ఏకత్వం..

- తలపాగాతో సందేశమిచ్చిన ప్రధాని మోదీ
- 77వ గణతంత్ర వేడుకల్లో రాజస్థానీ తరహా తలపాగాతో ప్రధాని
- ఎరుపు రంగు టై-డై వస్త్రంపై బంగారు జరీ వర్క్‌తో ప్రత్యేక ఆకర్షణ
- ప్రతి ఏటా విభిన్న సంస్కృతులకు ప్రతీకగా తలపాగాలు ధరిస్తున్న మోదీ
- గతేడాది ఎరుపు, పసుపు రంగుల బాంధేజ్ తలపాగా ధరించిన ప్రధాని





## రష్యాలో కార్మికుల కొరత..

- భారీగా భారతీయుల నియామకానికి రంగం సిద్ధం
- కార్మికుల కొరతతో రష్యాలో భారీగా భారతీయ నియామకాలు
- ఈ ఏడాది 40,000 మందిని తీసుకోనున్నట్లు అంచనా
- కార్మికుల తరలింపుపై ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాలు
- రష్యాలో 30 లక్షల మంది నైపుణ్య నిపుణుల కొరత

# పాలనలో టెక్నాలజీ వినియోగం పెంచాలి



- సీఎం చంద్రబాబు
- డేటా ఆధారిత పాలనే లక్ష్యం.. ఆర్టీజీఎస్‌పై సీఎం సమీక్ష
- 2026ను 'టెక్నాలజీ డ్రివెన్ డిసిషన్ మేకింగ్ ఇయర్‌'గా మార్చాలని పిలుపు
- ప్రభుత్వ సేవల్లో కృత్రిమ మేధ వినియోగం పెంచాలని సీఎం ఆదేశం
- 'మన మిత్ర' ద్వారా ఇప్పటివరకు 1.43 కోట్ల మందికి సేవలు

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

పాలనలో సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించి, క్షేత్రస్థాయి ఉద్యోగులపై పని భారాన్ని తగ్గించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. డేటా ఆధారిత పాలనపై మరింత దృష్టి సారిస్తామని, 2026వ సంవత్సరాన్ని 'టెక్నాలజీ డ్రివెన్ డిసిషన్ మేకింగ్ ఇయర్'గా మార్చాలని ఆయన ఆకాంక్షించారు. అమరావతి లోని క్యాంపు కార్యాలయంలో ఆర్టీజీఎస్‌పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... సామర్థ్యం లేని ఉద్యోగులకు - మిగతా3లో



## లోక్ భవన్‌లో తేనీటి విందు ఇచ్చిన గవర్నర్

హాజరైన హైకోర్టు చీఫ్ జస్టిస్, సీఎం, డిప్యూటీ సీఎం దంపతులు

పలువురు మంత్రులు హాజరు

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి విజయవాడ**

77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, గవర్నర్ సతీమణి సమీరా నజీర్ సోమవారం విజయవాడలోని లోక్ భవన్ లాన్స్‌లో తేనీటి విందును సుహృద్భావ వాతావరణంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి - మిగతా3లో



## భారత్ తో ట్రేడ్ డీల్‌కు ఆ ముగ్గురూ అడ్డుపడ్డారు

- ట్రంప్ పై సెనేటర్ విమర్శలు
- ట్రంప్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు
- అధ్యక్షుడిపై ఆరోపణలు గుప్పించిన టెక్సస్ సెనేటర్ టెడ్ క్రూజ్
- టారిఫ్‌లు వద్దన్నందుకు ట్రంప్ తనపై అరిచాడని వెల్లడి




## తగ్గనున్న కార్ల ధరలు!

- భారత్, ఈయూ మధ్య చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం..
- విజయవంతమైన భారత్ ప్రపంచానికి ఎంతో మేలు చేస్తుందన్న ఈయూ అధ్యక్షురాలు
- భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందానికి రంగం సిద్ధం
- ఈ ఒప్పందంతో 200 కోట్ల మందితో అతిపెద్ద మార్కెట్ ఏర్పాటు
- యూరప్ నుంచి దిగుమతి అయ్యే కార్లపై సుంకాలు భారీగా తగ్గే అవకాశం

# కర్తవ్యపథ్‌లో రిపబ్లిక్ డే

## జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము

- కర్తవ్యపథ్‌లో ఘనంగా 77వ గణతంత్ర వేడుకలు
- వేడుకలపై పూలవర్షం కురిపించిన 4 ఎంఐ-17 హెలికాప్టర్లు
- పరేడ్‌లో పాల్గొన్న ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక బృందం
- ఆపరేషన్ సిందూర్ ఆయుధ వ్యవస్థను ప్రదర్శించిన త్రివిధదళాలు



# క్రాస్ రోడ్స్‌లో జగన్ ..
# సజ్జల వైపా, విజయసాయి వైపా

**విజయవాడ :** వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో కోటరీ రగడ ఇప్పుడు బహిరంగ చర్చకు వచ్చేసింది. పార్టీ ఆవిర్భావం నుండి జగన్ వెన్నంటే ఉండి, 2019 విజయపథంలో కీలక పాత్ర పోషించిన విజయసాయిరెడ్డి, ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి , జగన్‌కు దూరమయ్యారు. కానీ తాను జగన్ కోసం పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన సంకేతాలు పంపుతున్నారు. కాకపోతే ప్రస్తుతం ఉన్న సజ్జల కోటరీని బయటకు పంపాలంటున్నారు. దీంతో జగన్ కు ఇప్పుడు కొత్త ఆలోచనలు వచ్చే అవకాశం ఉంది. ఒకప్పుడు జగన్ 'ఏ-2'గా, పార్టీకి వెన్నెముకగా భావించిన విజయసాయిరెడ్డి ఇప్పుడు దూరమయ్యారు. అయితే తాను జగన్‌కు దూరం కాలేదని, తనను జగన్ నుండి ప్రస్తుతం ఉన్న కోటరీ సభ్యులే దూరం చేశారని ఆయన బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి సహా ప్రస్తుతం జగన్ చుట్టూ ఉన్న వారికి కనీస రాజకీయ పరిజ్ఞానం లేదని, వారు జగన్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించడం పార్టీలో ఉన్న తీవ్ర విభేదాలను సూచిస్తోంది. తనను తిరిగి పార్టీ బాధ్యతల్లోకి తీసుకుంటే కూటమిని విడగొట్టి, జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడతానని ఆయన చేస్తున్న ప్రకటన వైసీపీ శ్రేణుల్లో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది.వైసీపీ క్షేత్రస్థాయి క్యాడర్‌లో విజయసాయిరెడ్డి పట్ల సానుకూలత కనిపిస్తోంది. 2019 ఎన్నికల సమయంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి, బూత్ స్థాయి వరకు యంత్రాంగాన్ని నడిపించిన ఘనత విజయసాయిరెడ్డిదేనని మెజారిటీ కార్యకర్తలు నమ్ముతున్నారు. అదే సమయంలో 2024 ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయానికి సజ్జల రామకృష్ణారెడ్డి



నేతృత్వంలోని కోటరీ అనుసరించిన అతి విశ్వాసం, కార్యకర్తలకు నేతలను దూరం చేసిన తీరే కారణమని క్యాడర్ బలంగా విశ్వసిస్తోంది. క్షేత్రస్థాయి పరిస్థితులను జగన్ దృష్టికి వెళ్లకుండా అడ్డుకున్నారనే అపవాదు సజ్జల కోటరీపై బలంగా పడింది.ప్రస్తుతం జగన్ మోహన్ రెడ్డి ఒక కీలకమైన కూడలిలో ఉన్నారు. ఆయన ముందు ప్రధానంగా రెండు మార్గాలు కనిపిస్తున్నాయి: ఒకటి, గడిచిన ఐదేళ్లుగా తన వెన్నంటే ఉండి, పార్టీ విధానాలను నడిపించిన సజ్జల. ప్రస్తుత కోటరీనే నమ్ముకుని ముందుకు సాగడం. రెండు, పాత మిత్రుడిని, వ్యూహకర్తను విశ్వసించి విజయసాయిరెడ్డికి మళ్లీ పగ్గాలు అప్పగించడం. అయితే, జగన్ సాధారణంగా తాను నమ్మిన వారిని వదులుకోవడానికి ఇష్టపడరని, కానీ ఇప్పుడు పార్టీ ఉనికికే ప్రమాదం ఏర్పడిన తరుణంలో ఆయన తన పంథాను మార్చుకుంటారా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.విజయసాయిరెడ్డి ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులతో వ్యక్తిగత సంబంధాలను కలిగి ఉన్నారు. ఆయనను పక్కన పెట్టడం వల్ల ఉత్తరాంధ్రతో పాటు పలు జిల్లాల్లో పార్టీ పట్టు కోల్పోయిందనే వాదన ఉంది. మరోవైపు, సజ్జల రామకృష్ణారెడ్డి అన్ని విభాగాలను ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేసినప్పటికీ, అది కేవలం పాలనాపరమైన సలహాలకే పరిమితమైందని, రాజకీయ వ్యూహాల్లో ఆయన విఫలమయ్యారని పార్టీలోని ఒక వర్గం భావిస్తోంది. ఇప్పుడు విజయసాయిరెడ్డి నేరుగా సవాల్ విసురుతున్నందున జగన్ ఎవరి వైపు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారింది.ప్రస్తుతం ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అత్యంత పటిష్టంగా ఉంది. ఇటువంటి బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవాలంటే కేవలం సామాజిక సమీకరణాలు మాత్రమే సరిపోవని, రాజకీయంగా చీలికలు తెచ్చే పక్కా వ్యూహాలు అవసరమని విజయసాయిరెడ్డి అభిప్రాయపడుతున్నారు. ఆయనకు ఉన్న పాత నెట్‌వర్క్, రాజకీయ చాణక్యం ఇప్పుడు పార్టీకి అవసరమని క్యాడర్ కోరుకుంటోంది. జగన్ తన కోటరీని ప్రక్షాళన చేయకుండా కేవలం ప్రజల్లోకి వెళ్తే ఫలితం ఉండదని, లోపల వ్యవస్థను మార్చాలని కోరుకుంటున్నారు. రాబోయే రోజుల్లో జగన్ కోటరీలో మార్పులు జరిగే అవకాశాలను కొట్టిపారేయలేం. ఒకవేళ విజయసాయిరెడ్డిని జగన్ ఆహ్వానిస్తే సజ్జల కోటరీ బయటకు పోవాల్సి ఉంటుంది. జగన్ ఇప్పటికీ మౌనంగానే ఉంటూ పరిణామాలు గమనిస్తున్నారు. విజయసాయిరెడ్డి చేస్తున్న ప్రతిపాదన జగన్ హృదయాన్ని గెలుచుకుంటుందా లేక కోటరీ గోడలకు తగిలి వెనక్కి వస్తుందా అనేది వేచి చూడాలి.

# గీతం చుట్టూ వివాదం

**విశాఖపట్టణం :** విశాఖపట్నంలోని గీతం విద్యా సంస్థలకు సంబంధించిన భూముల క్రమబద్ధీకరణ అంశం ప్రస్తుతం రాజకీయంగా, జనవరి 30, 2026న జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని అజెండాలో చేర్చడం వివాదానికి దారితీసింది. అది అప్పనంగా భూములు కట్టబెట్టడమేనని వైసీపీ సహా కొంత మంది సామాజికవేత్తలు ఆరోపణలు చేస్తున్నారు. అయితే ఇవి తమకు గతంలో కేటాయించినవేనని గీతం అంటోంది. సుమారు 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని క్రమబద్ధీకరించాలని జీవీఎంసీ ప్రతిపాదించింది. విశాఖలోని అత్యంత ఖరీదైన రుషికొండ, ఎండాడ గ్రామాల్లోని సర్వే నంబర్లు 17/1, 17/28 వంటి చోట్ల ఈ భూములు ఉన్నాయి. గీతం సంస్థ 1980లలో స్థాపించబడింది. అప్పటి నుంచి వివిధ దశల్లో ప్రభుత్వం కేటాయించిన భూములతో పాటు, మరికొంత భూమిని సంస్థ తన అధీనంలో ఉంచుకుందన్న ఆరోపణలు ఉన్నాయి. సుమారు 4 దశాబ్దాలుగా ఈ భూములు ఆ సంస్థ ఆధీనంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ భూముల చుట్టూ ఉన్న వివాదం ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో , గీతం సంస్థ సుమారు 40 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించిందని ఆరోపిస్తూ రెవెన్యూ అధికారులు కొన్ని ప్రహరీ గోడలను కూల్చివేసి, భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఆ భూములకు కంచె వేసి ప్రభుత్వ భూమి అని బోర్డులు కూడా పెట్టారు. అక్కడ ప్రస్తుతం భూముల విలువ భారీగా పెరిగింది. విలువైన భూమిని ఒక ప్రైవేట్ సంస్థకు తక్కువ ధరకే లేదా ఉచితంగా క్రమబద్ధీకరించడంపై మాజీ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ వంటి మేధావులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, విద్యా సంస్థల అవసరాల దృష్ట్యా ఈ భూములను క్రమబద్ధీకరించాలని భావిస్తోంది. దీనిని జీవీఎంసీ కౌన్సిల్ అజెండాలో 15వ అంశంగా చేర్చారు. కౌన్సిల్ ఆమోదం పొందితే, ప్రభుత్వం నిర్ణయించిన క్రమబద్ధీకరణ ఫీజు చెల్లించి గీతం సంస్థ ఈ భూములను అధికారికంగా పొందవచ్చు.గీతం విద్యాసంస్థల యాజమాన్యం తమపై వస్తున్న ఆక్రమణ ఆరోపణలను మొదటి నుంచి ఖండిస్తూనే ఉంది. సంస్థ ప్రతినిధుల ప్రకారం, గీతం క్యాంపస్ ఉన్న భూమిలో మెజారిటీ భాగం 1980వ దశకంలో అప్పటి ప్రభుత్వం నుంచి అధికారికంగా కేటాయించింది. విద్యాసంస్థల విస్తరణ కోసం అప్పట్లో భూములను ప్రభుత్వం



కేటాయించిందని, తాము నిబంధనలకు విరుద్ధంగా ఏదీ నిర్మించలేదని వారు వాదిస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించినప్పుడు, గీతం యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. ఆ భూములకు సంబంధించి తమ వద్ద తగిన పత్రాలు ఉన్నాయని వారు కోర్టుకు సమర్పించారు. అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టారని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వారు వాదించారు. గీతం ఒక లాభాపేక్ష లేని విద్యాసంస్థగా, వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోందని వారి వాదన. క్యాంపస్‌లో ఉన్న ఖాళీ స్థలాలు లేదా వివాదాస్పదంగా మారిన భూములు కూడా క్రీడా మైదానాలుగా, విద్యా సంబంధిత సౌకర్యాల కోసమే వాడుతున్నామని వారు చెబుతున్నారు. దశాబ్దాల కాలంగా సంస్థ ఆధీనంలో ఉన్న భూములను ఇప్పుడు ఆక్రమణలుగా పరిగణించడం సరికాదని వారి అభిప్రాయం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏదైనా సాంకేతిక కారణాల వల్ల భూమి కేటాయింపులో లోపాలు ఉంటే, ప్రస్తుత ప్రభుత్వ జీవోల ప్రకారం నిర్ణీత రుసుము చెల్లించి ఆ భూములను క్రమబద్ధీకరించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని సంస్థ గతంలోనూ సూచించింది. గీతం సంస్థ వాదన ప్రకారం, వారు ఏ భూమినీ ఉద్దేశపూర్వకంగా ఆక్రమించ లేదు. 40 ఏళ్లుగా విద్యా సేవలు అందిస్తున్న సంస్థపై రాజకీయ కారణాలతోనే ఆరోపణలు వస్తున్నాయని, చట్టపరంగా తమకు హక్కులు ఉన్నాయని వారంటున్నారు. గీతం యాజమాన్యం రాజకీయ కుటుంబం. ప్రస్తుతం విశాఖ ఎంపీగా ఉన్న భరత్ విద్యాసంస్థ వ్యవహారాలు చూస్తున్నారు. మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి మనవడు భరత్. ఆయన బాలకృష్ణ అల్లుడు కూడా. అంటే సీఎం చంద్రబాబుకు సమీప బంధువే. రాజకీయ కుటుంబం కావడంతో ఈ వ్యవహారంపై మరిన్ని ఆరోపణలు వస్తున్నాయి. ఆ భూములు దశాబ్దాలుగా విద్యా సంస్థ అవసరాలకు వాడుతున్నా ఆ విషయం ఎక్కడా బయటకు రాకుండా ఆరోపణలు చేస్తున్నారని భరత్ వర్గీయులు అంటున్నారు. మొత్తానికి ఈ వివాదం రాజకీయ మలుపులు తిరగడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఏడాదిలో విమానాల అద్దెకే 14 కోట్లు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక విమానాల వినియోగంపై మరోసారి రాజకీయ చర్చ మొదలైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు ఆయన ప్రయాణాలకు సంబంధించిన ఖర్చులు గణనీయంగా పెరిగినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ముఖ్యంగా నాలుగో త్రైమాసికానికి సంబంధించిన ఖర్చుల కోసం సాధారణ పరిపాలన శాఖతాజాగా జారీ చేసిన ఉత్తర్వులు ఈ అంశాన్ని మరింత హాట్ టాపిక్‌గా మార్చాయి.నాలుగో త్రైమాసికంలో హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల అద్దెల కోసం రాష్ట్ర ఆర్థిక శాఖ రూ.13.65 కోట్లను విడుదల చేసింది. దీనికి సంబంధించిన జీవో వెలువడటంతో ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఒకప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిప్రత్యేక విమానాల ఖర్చుపై తీవ్రంగా విమర్శలు చేసిన చంద్రబాబు, ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మరింత ఎక్కువగా ఖర్చు చేస్తున్నారా? అన్న ప్రశ్న రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.ముఖ్యమంత్రి హోదాలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేయాల్సి ఉంటుంది. జిల్లాల మధ్య ప్రయాణాలకు హెలికాప్టర్ లేదా ప్రత్యేక విమానం వినియోగించడం తప్పు కాదన్న అభిప్రాయం కూడా ఉంది. ముఖ్యమంత్రి సమయానికి ఉండే విలువను దృష్టిలో ఉంచుకుంటే, వేగంగా ప్రయాణించాల్సిన అవసరం సహజమేనని కొందరు చెబుతున్నారు. అయితే వివాదానికి కారణమవుతున్నది అధికారిక పర్యటనలకన్నా, వారాంతాల్లో విజయవాడ నుంచి హైదరాబాద్ మధ్య జరిగే ప్రయాణాలే.చంద్రబాబు కుటుంబం హైదరాబాద్‌లో ఉండటంతో వీకెండ్లలో అక్కడికి వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రయాణాలకు ప్రత్యేక విమానాలను వినియోగించడంపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. విపక్ష నేతగా ఉన్న రోజుల్లో ఆయన సాధారణ పౌర విమానాల్లో ప్రయాణించేవారని, సామాన్యులతో కలిసి ప్రయాణించిన సందర్భాలు గుర్తు చేస్తున్నాయి. ముఖ్యమంత్రి అయ్యాక భద్రతా కారణాలు, సమయపరిమితులు ఉండటం సహజమే అయినా, వ్యక్తిగత అవసరాలకు అయ్యే ఖర్చుపై మరింత జాగ్రత్తగా ఉండాల్సిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.అధికారిక గణాంకాల ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల కోసం మొత్తం ఖర్చు రూ.54.63 కోట్లకు చేరింది. తొలి త్రైమాసికంలో రూ.19.12 కోట్లు ఖర్చు కాగా, రెండో మరియు మూడో త్రైమాసికాల్లో రూ.10.92 కోట్ల చొప్పున వెచ్చించారు. తాజాగా నాలుగో త్రైమాసికానికి విడుదల చేసిన రూ.13.65 కోట్లతో మొత్తం వ్యయం రూ.54 కోట్లను దాటింది. ఈ సంఖ్యలు బయటకు రావడంతో విమర్శలు మరింత పెరిగాయి.ప్రత్యేక విమానాల వినియోగం చంద్రబాబుపై విమర్శలకు తరచూ కారణమవుతున్న అంశంగా మారింది. ఈ విషయాన్ని రాజకీయ ప్రత్యర్థులే కాదు, సొంత పార్టీ నేతలు కూడా ప్రస్తావిస్తున్నట్టు వినిపిస్తోంది. అధికారిక బాధ్యతలు, వ్యక్తిగత అవసరాల మధ్య స్పష్టమైన గీత గీయగలిగితే, ఇలాంటి విమర్శలకు తావు లేకుండా ఉంటుందన్న మాట రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది.

## ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి

-మొదటిపేజీ తరువాయి

ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ (బాయ్స్ అండ్ గరల్స్), భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ (బాయ్స్ అండ్ గరల్స్), యూత్ రెడ్ క్రాస్ (బాయ్స్) కంటింజెంట్స్ కవాతును నిర్వహించారు. కవాతులో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఇండియన్ ఆర్మీ కంటింజెంట్ కు మొదటి స్థానం, విశాఖపట్టణం ఏపీఎస్పీ 16 వ బెటాలియన్ కు రెండో స్థానం, కాన్సులేషన్ ప్రైజ్ గా కేరళ రాష్ట్ర పోలీస్ కంటింజెంట్ కు అందించారు. పెరేడ్ లో ప్రధానంగా బ్రాస్ బ్యాండ్, పైప్ బ్యాండ్ ఆహుతులను అలరించాయి. పెరేడ్ కు మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్ ఐజీపీ బీ. రాజకుమారి నోడల్ ఆఫీసర్ గాను, డీఐజీ డా. కె. ఫకీరప్ప కోఆర్డినేటింగ్ ఆఫీసర్ గాను వ్యవహరించారు. పెరేడ్ కమాండర్ గా జంగారెడ్డి గూడెం ఏఎస్పీ పరేడ్ కమాండర్ ఆర్. సుస్మిత, పెరేడ్ సెకండ్ ఇన్ కమాండ్ ఏపీఎస్పీ మొదటి ఐఆర్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ టీ.ఎన్. శ్రీనివాసరావు, పెరేడ్ అడ్జుటెంట్ కాకినాడ ఏపీఎస్పీ 3 వ బెటాలియన్ ఎం. శివరామకష్ణ లు వ్యవహరించారు. రిపబ్లిక్ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ దంపతులు, మానవ వనరుల అభివద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, గౌరవ హైకోర్టు న్యాయమూర్తులు, పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ జే. శ్యామలరావు, గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా,ఎస్పీ వకుల్ జిందాల్, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు హాజరయ్యారు. అమరావతి రాజధానిలో నిర్వహించిన ఈ గణతంత్ర దినోత్సవ వేడుకలు రాష్ట్ర ఐక్యత, ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబిస్తూ ఘనంగా ముగిశాయి. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతి రాజధానిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖలు రూపొందించిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర అభివద్ధి, సంక్షేమ పథకాలు, సాంస్కృతిక వారసత్వం, సామాజిక అవగాహన అంశాలను ప్రతిబింబించేలా రూపొందించిన శకటాలు కనువిందు చేశాయి. శకటాల్లో వందేమాతరం150 సంవత్సరాల ఇతివత్తంగా రూపొందించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ శకటానికి ప్రథమ, మహిళా సంక్షేమమే చంద్రన్న ధ్యేయం తో రూపొందిన సెర్ప్ శకటానికి ద్వితీయ, పెట్టుబడుల ద్వారా ఉపాధి ఇతివత్తంగా రూపొందిన పరిశ్రమల శాఖ శకటానికి తతీయ స్థానాల్లో నిలిచాయి. వీటితోపాటు జనాభా నిర్వహణ, మానవ వనరుల అభివద్ధి), ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యా శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, నైపుణ్యం, ఉపాధి స్కిల్ డవలప్ మెంట్ కార్పొరేషన్, పాఠశాల విద్యా శాఖ, పర్యాటక శాఖ, జలవనరుల అభివద్ధి శాఖ, మైక్రో ఇరిగేషన్, అటవీ శాఖ లు, రైతువ్యవసాయ సాంకేతికత తో వ్యవసాయ శాఖ, మత్స్య శాఖ లు, మౌలిక వసతులు పెట్టుబడులు, సముద్ర మరియు వైమానిక రంగాలు, సీఆర్డీఏ లు, వ్యయ అత్యుత్తమీకరణ (ఖర్చుతగ్గింపు) శక్తి, ఇంధనం నెడ్కాప్ (ఇంధనం), ఉత్పత్తి పరిపూర్ణ, చేనేత, జౌళి శాఖ, ఉద్యానవన శాఖ, స్వచ్ఛ ఆంధ్ పురపాలక పట్టణాభివద్ధి శాఖ (స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్), పంచాయతీరాజ్ గ్రామీణాభివద్ధి శాఖ, ఆర్టీజీఎస్ శాఖల శకటాలు ప్రభుత్వ సంకల్పం, ప్రజా సంక్షేమ లక్ష్యాలను స్పష్టంగా ఆవిష్కరించాయి. ఆధునిక సాంకేతికతతో పాటు సంప్రదాయ కళారూపాల మేళవింపుతో రూపొందిన శకటాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## పాలనలో టెక్నాలజీ వినియోగం పెంచాలి

-మొదటిపేజీ తరువాయి

సరైన శిక్షణ ఇచ్చి, వారి పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాలనలో ఎదురయ్యే అనేక సమస్యలను టెక్నాలజీతో సులభంగా పరిష్కరించవచ్చని అన్నారు. ముఖ్యంగా, ప్రభుత్వ సేవల్లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని పెంచాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను (గ్రీవెన్సులు) ఏఐ ద్వారా వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. 'మన మిత్ర' - వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 878 రకాల ప్రభుత్వ సేవలను అందిస్తున్నామని, ఇప్పటివరకు 1.43 కోట్ల మంది ఈ సేవలను వినియోగించుకున్నారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం వైద్యం, వ్యవసాయం, రెవెన్యూ, రహదారులు, ఆర్టీఏ, అగ్నిమాపక శాఖల పనితీరుపై కూడా సీఎం సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

## లోక్ భవన్‌లో తేనీటి విందు ఇచ్చిన గవర్నర్

-మొదటిపేజీ తరువాయి

ఎన్. చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి ఎన్. భువనేశ్వరి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఆయన సతీమణి గుడియా ఠాకూర్, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, ఆయన సతీమణి అన్నా లెజ్నెవా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం, ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె. రఘురామ కష్ణరాజు, ఐటీ మానవ వనరుల అభివద్ధి మంత్రి ఎన్. లోకేష్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత, వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చన్నాయుడు, సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల మంత్రి కె. శ్రీనివాస్, ఎంఏ యుడి మంత్రి పి. నారాయణ, ఎక్సైజ్ మంత్రి కె. రవీంద్ర, రవాణా శాఖ మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు, ప్రధాన సమాచార కమిషనర్, సమాచార కమిషనర్లు, చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఆల్ ఇండియా సర్వీస్ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, రక్షణ శాఖ సిబ్బంది, క్రీడాకారులు, పద్మ అవార్డు గ్రహీతలు, మీడియా ప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, మహిళా సర్పంచ్‌లు, మెరిట్ విద్యార్థులు, ఎన్జీఓల ప్రతినిధులు వంటి ప్రత్యేక ఆహ్వానితులు తేనీటి విందుకు హాజరైన ఇతర ప్రముఖులలో ఉన్నారు. ముందుగా, గవర్నర్ అబ్దుల్ నజీర్ వేదిక చుట్టూ వెళ్లి అతిథులందరినీ మర్యాదపూర్వకంగా పలకరించారు.

## మహిళలకు బడ్జెట్ కేటాయింపులు ఎప్పుడు

**విజయవాడ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుపై మరింత దృష్టి పెట్టినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎన్నికల సమయంలో "సూపర్ సిక్స్" హామీలతో ప్రజల ముందుకు వెళ్లిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని హామీలను ఇప్పటికే అమలు చేస్తోంది. ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం , ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలు మహిళలకు ప్రత్యక్షంగా లాభం చేకూరుస్తున్నాయి. అయితే ఈ హామీల్లో కీలకమైన ఆడబిడ్డ నిధి పథకం అమలుపై ఇప్పటివరకు స్పష్టత లేకపోవడంతో విమర్శలు పెరిగాయి.రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వల్ల ఈ పథకం ఆలస్యం అవుతోందని ప్రభుత్వం ఇప్పటివరకు వివరణ ఇచ్చింది. అయినా కూడా ప్రతిపక్షాల నుంచి ఒత్తిడి పెరగడం, లబ్ధిదారులైన మహిళల్లో ఆశలు ఎక్కువ కావడంతో ప్రభుత్వం ఇప్పుడు ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు ఉన్న మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఈ మొత్తాన్ని అమలు చేయాలంటే ప్రభుత్వ ఖజానాపై భారీ భారం పడనుంది. అయినా రాజకీయంగా, సామాజికంగా ఈ పథకం ప్రాధాన్యం ఎక్కువగా ఉండటంతో అమలు తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఎన్నికలు ముగిసి దాదాపు 20 నెలలు గడవడం, త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండటం కూడా ప్రభుత్వ నిర్ణయంపై ప్రభావం చూపినట్లు చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచే ఆడబిడ్డ నిధిని ప్రారంభించాలన్న ఆలోచనతో ఉన్నతస్థాయి చర్చలు జరిగాయని ప్రచారం. నెలనెలా నగదు జమ చేయాలా? లేక సంవత్సరానికి ఒకసారి మొత్తంగా ఇవ్వాలా? అనే అంశాలపై అధికారులు అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. పథకం అమలుకు అవసరమైన మార్గదర్శకాలు, అర్హతలపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాలు ఈ విషయంలో కీలకంగా మారనున్నాయి. ఫిబ్రవరి 14న అసెంబ్లీలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఆర్థిక బడ్జెట్‌తో పాటు వ్యవసాయ, ఇరిగేషన్ రంగాలకు ప్రత్యేక కేటాయింపులు ఉండనున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో సంక్షేమ కార్యక్రమాలకు కూడా పెద్దపీట వేయనున్నట్లు సమాచారం. తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, ఉపాధి కల్పన వంటి హామీల అమలుపై ప్రభుత్వం చిత్తశుద్ధిగా పనిచేస్తోందని మంత్రులు చెబుతున్నారు. ఆడబిడ్డ నిధిపై బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయనే నమ్మకం ప్రజల్లో పెరుగుతోంది. అయితే కేటాయింపులు చేసినా, వాస్తవంగా ఎప్పటి నుంచి అమలు చేస్తారన్నదే ఇప్పుడు ప్రధాన ఉత్కంఠ. బడ్జెట్ ప్రకటనతో ఈ సందేహాలకు తెరపడుతుందా? లేదంటే మరోసారి ఎదురుచూపులేనా? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

# రాష్ట్రంలో బహుజనులకు అధికారమే లక్ష్యం

- అనంతలో ఏప్రిల్ లో సమావేశం.
- ప్రతి బహుజన బిడ్డా ముందుకు రావాలి
- డా. పోతుల నాగరాజు

**అంకుశం న్యూస్ అనంతపురం జనవరి 26 :** రాష్ట్రంలో బహుజనులకు అధికారమే లక్ష్యంగా అందరినీ ఒక వేదిక మీదకు తీసుకురావడానికి ఏప్రిల్ లో అనంతపురంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి అందరి సూచనలతో ముందుకు పోతామని పాలకులకు వ్యతిరేకంగా ప్రతి బహుజన బిడ్డ తరలిరావాలని రిజర్వేషన్ పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ పోతుల నాగరాజు అన్నారు. 77 సంవత్సరాలనుండి రాష్టంలో రెండు కుటుంబాలు, రెండు పార్టీలు. రెండు కులాల ఆధిపత్యంలోనే పాలన కొనసాగుతున్నది. అని పోతుల నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితం ఇప్పుడు చూస్తున్నారు. ఎందుకంటే వీరికి ఓట్లు వేసి అధికారం అప్పగిస్తే ప్రజలకు ఏం ఇచ్చారు అనేది ఒక ప్రశ్న? అంటే రాష్ట్ర జనాభా లో 87%శాతం ఉన్న ప్రజల ఓట్లు తోనే వీరు అధికారం పొంది, వారి హక్కులను, అధికారాలను, అభివృద్ధి ని, సంక్షేమము ను కాలరాశారు. ఇలా కోల్పోయిన వారే దళితులు, గిరిజనలు, బలహీన వర్గాలు, మైనారిటీ వర్గ ప్రజలు, పేదలు. భారత రాజ్యాంగ ఫలాలు ఎవరికి దక్కాయి అనేది ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి



వ్యవస్థాపకులు డా. పోతుల నాగరాజు బహుజన సోదరులకు, సోదరి మణులకు, చదువు కొన్న విద్యా వంతులకు, ఉద్యోగులకు, రచయిత లకు, కళాకారులకు, కుల సంఘాల,ప్రజా సంఘాల,విద్యార్థి సంఘాల, రైతు, కార్మిక సంఘాలకు, మహిళా తల్లులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అందుకే మన ఓట్లు మనం వేసుకొని మనమే మన రాజ్యంను పరిపాలన చేసుకొందాం అని పిలుపు నిచ్చిన కాన్షిరాం గారి స్ఫూర్తి తో, ప్రతి పౌరుడుకి కులం తో, మతం తో, డబ్బు తో, జెండర్ తో సంబంధం లేకుండా ఓటు హక్కు కల్పించిన రాజ్యాంగ నిర్మాత డా. దీ=, అంబేద్కర్ గారి ఆశయ సాధన తోనూ మనం ఐక్యత కొనసాగించాలని, గత దశాబ్దాల నుంచి ఈ వర్గాల కోసమే పని చేస్తున్న దీజ, రాజ, ా, మైనారిటీ, కుల సంఘాల నేతలను, ప్రజాసంఘాల నేతలను, ఉద్యోగ సంఘాల నాయకులను, మహిళా ప్రతినిధులను, విద్యార్థి నేతలను, రాజకీయ పార్టీ ల అధ్యక్షులు దీ్రా, ా, =జీణ, ణవీఖ, దీజ్ పార్టీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ, ఇలా బహుజన ప్రజల అభివృద్ధి సంక్షేమము కోసం రాజ్యాధికారం కోసం పని చేస్తున్న వారిని గుర్తించి ప్రతి ఒక్కరిని కలసి 2029 ఎన్నికలలో అధికారం బహుజనలకు ధక్కే విధంగా బహుజన ఐక్య ప్రజా ఫ్రంట్ గా ఏర్పడి ముందుకు వెళ్లే ప్రయత్నం జరుగుతుంది అని ఈ సమావేశం ఏప్రిల్ రెండవ వారంలో అనంతపురం జిల్లా కేంద్రం లో ఏర్పాటు చేయడం జరుగుతుంది అని డా. పోతుల నాగరాజు మీడియా కు తెలిపారు.

# రాష్ట్రంలో అరాచకం చేస్తున్న కూటమి ప్రభుత్వం

- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మండిపాటు
- వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో 77వ గణతంత్ర వేడుకలు







**అంకుశం న్యూస్ అనంతపురం, జనవరి 26 :** ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం అరాచకాలు చేస్తూ ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తుందని ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదనిరాజ్యాంగం కల్పించిన హక్కులను చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. సోమవారం అనంతపురంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో 77వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయ జెండాను వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాజ్యాంగం సమాన హక్కులు, సమాన అవకాశాలను అందరికీ కల్పించిందని చెప్పారు. ఈ రోజు దేశమంతా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలు అవుతుంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. రాజ్యాంగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై గాంధీజీ చూపిన మార్గంలో వైఎస్ జగన్ నాయకత్వంలో తమ పార్టీ ముందుకు వెళ్తోందని చెప్పారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను గౌరవిస్తూ దేశానికే తలమానికంగా 206 అడుగుల ఎత్తుతో విజయవాడలో మహనీయుడైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. బీఆర్ అంబేద్కర్ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముందుకెళ్తుందని స్పష్టం చేశారు.

# క్రికెటర్లకు పద్మశ్రీ రావడం యువతకు స్ఫూర్తి

- పద్మ అవార్డులకు ఎంపికైన క్రికెటర్లకు ఏసీఏ ప్రెసిడెంట్ , ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు

**అంకుశం న్యూస్ విజయవాడ జనవరి 26 :** భారత క్రికెటర్లకు పద్మశ్రీ రావడంతో దేశవ్యాప్తంగా రాబోవు తరం యువ క్రికెటర్లకు స్ఫూర్తినిస్తుందని ముఖ్యంగా మహిళా క్రికెటర్ కూడా పద్మశ్రీ కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం పట్ల రాబోవు రోజుల్లో క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు తల్లిదండ్రులు ముందుకు వస్తారని ఇది ఒక మంచి శుభ పరిణామం అని విజయవాడ ఎంపీ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని చిన్ని అన్నారు. క్రీడా రంగంలో తమ దైన ముద్ర వేసుకుని అత్యున్నత ప్రతిభ కనబర్చి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ శ్రీ అవార్డులకు ఎంపికైన క్రికెటర్ రోహిత్ శర్మకు, ఇండియా వుమెన్స్ టీమ్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్లకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా విభాగంలో దేశానికి విశేష సేవలు అందించిన ప్రతిభావంతులను కేంద్ర ప్రభుత్వం గౌరవించడం గర్వకారణమంటూ క్రికెటర్లు రోహిత్ శర్మ, హర్మన్ ప్రీత్ కౌర్ల ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరుపున అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తనదైన బ్యాటింగ్ శైలితో హిట్ మ్యాన్ గా పేరు తెచ్చుకున్న రోహిత్ శర్మ, ఇండియన్ టీమ్ కెప్టెన్ గానూ భారత క్రికెట్ పై బలమైన ముద్ర వేశాడని కొనియాడారు. హర్మన్ ప్రీత్ కౌర్ నేతృత్వంలోనే ఇండియన్ వుమెన్స్ క్రికెట్ టీమ్ విశ్వవిజేత నిలిచిందని ప్రశంసించారు.





ఇలాంటి ప్రతిభ గల క్రికెట్ ప్లేయర్స్ కు పద్మశ్రీ అవార్డులు వరించటం ఎంతో సంతోషంగా వుందన్నారు. నాయకత్వం, నిరంతర ప్రతిభ, క్రీడల ద్వారా యువతకు స్ఫూర్తినిచ్చినందుకు ఈ గౌరవం సముచితమన్నారు. భవిష్యత్తులో కూడా భారత క్రీడా రంగం మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఏసీఏ ప్రెసిడెంట్ ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు.

## శ్రీ వైష్ణవి పాఠశాలలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు




**పోరుమామిళ్ల, జనవరి 26(అంకుశం పత్రిక):** పట్టణంలోని శ్రీ వైష్ణవి పాఠశాలలో సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహంచారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఆర్వీ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... ప్రపంచంలోనే మన దేశ రాజ్యాంగము ఎంతో అత్యున్నతమైనది అన్నారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజును గణతంత్ర దినోత్సవంగా, జాతీయ పండుగగా జరుపుకుంటున్నామన్నారు. కావున విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో దేశాభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ కళ్యాణి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ వారి వారి హక్కులను కాపాడుకుంటూ వారి బాధ్యతలు నిర్వర్తించాలి అన్నారు. బాధ్యతగా చదివి గొప్ప పౌరులుగా తయారవాలని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని అన్నారు. స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో జాతీయ గేయం "వందేమాతరం" 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణ ప్రజల్లో దేశభక్తిని పెంపొందించి, అవగాహన కల్పించేందుకు ఎన్సీసి విద్యార్థులతోబాటు ఉపాధ్యాయులు దేశభక్తి గీతాలతో, నినాదాలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ శకటం తో "వందేమాతరం ర్యాలీని" పట్టణం లోని అంబేద్కర్ సర్కిల్ నుండి పోలీస్ స్టేషన్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమం పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ కేశవరాయుడు, సీ,బీ,ఎస్,ఈ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నమిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అహుడా కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

- : జాతీయ పతాకావిష్కరణ చేసిన ఇంఛార్జి జిల్లా కలెక్టర్ & అహుడ వైస్ చైర్మన్ సి.విష్ణు చరణ్

**అంకుశం న్యూస్ అనంతపురం, జనవరి 26 :** నగరంలోని అహుడా కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇంఛార్జి జిల్లా కలెక్టర్ & అహుడ వైస్ చైర్మన్ సి.విష్ణు చరణ్ జాతీయ పతాకావిష్కరణ చేసి, జాతీయ గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో అహుడ చైర్మన్ టి.సి.వరుణ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, అహుడ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, బిఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు ఇంఛార్జి జిల్లా కలెక్టర్, ఛైర్మన్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అహుడా కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**అంకుశం న్యూస్ తిరుపతి జనవరి 26:** 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా సోమవారం ఉదయం తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడు జాతీయ జెండాను ఎగురవేసి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా టీటీడీ విజిలెన్స్ సిబ్బంది చైర్మన్ కు గౌరవ వందనం చేశారు. అనంతరం ఉద్యోగులకు స్వీట్లు, చాక్లెట్లు పంచారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శ్రీమతి పనబాక లక్ష్మి, శాంతారామ్, నరేష్, శ్రీ దర్శన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పుట్టిన గడ్డపై జాతీయ పతాకం ఎగురవేసిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి



పాత ముచ్చుమర్రి హైస్కూల్ ఆవరణలో మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖరరెడ్డి



పాత ముచ్చుమర్రిలో జాతీయ పతాకం ఎగుర వేస్తున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి

**అంకుశం న్యూస్ నంద్యాల్ జనవరి 26:** నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామం తను పుట్టిన గడ్డపై టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి మువ్వన్నెల జెండా ఎగురవేసి ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం పాత ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మాజీ శాసనసభ్యులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి, గ్రామ ప్రజలతో కలిసి వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది మహనీయుల త్యాగఫలితం, భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి మహనీయుల త్యాగాలను నేటి తరం వారు స్మరించుకుంటూ, వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామానికి చెందిన, పెద్దలు, యువకులు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కేశినేని శివనాథ్ క్యాంపు కార్యాలయంలో సీ.ఎం.ఆర్.ఎఫ్. చెక్కు అందజేత



**అంకుశం న్యూస్ విజయవాడ జనవరి 26:** పేద ప్రజల ఆరోగ్య విషయంలో ఎక్కడ రాజీ పడకుండా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎంపీ కేశినేని శివనాథ్ సహకారంతో నియోజకవర్గంలోని పేద ప్రజలకు ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలుగుదేశం పార్టీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ నాయకులు తెలిపారు.పశ్చిమ నియోజకవర్గం గణపతి రావు రోడ్డులో గల ఎంపీ కేశినేని శివనాథ్ క్యాంపు కార్యాలయంలో సోమవారం క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న 46 డివిజన్ కె.ఎల్.రావు నగర్ కి చెందిన పల్లివేల్ల ప్రసాద్ కు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.28,800 విలువగల చెక్కను ఆయన భార్య పలివెల్ల నాగవేణి కి గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాల మాధవ, ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి రేగళ్ల లక్ష్మణారావు అందజేశారు.

ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం తెలుగు యువత, ఐటీడీపీ అధ్యక్షులు చైతన్య,మాధవ్, పశ్చిమ నియోజకవర్గ ఎస్సీ సెల్ , తెలుగు యువత వైస్ ప్రెసిడెంట్ రవి,భవానీ శంకర్ ,49,51 డివిజన్ అధ్యక్షులు బడుగు వెంకన్న,కుంచం దుర్గారావు, పశ్చిమ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజశేఖర్ రెడ్డి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ ఫలాలను చేరవేసే బాధ్యతను నెరవేరుద్దాం -ఎంపీడీఓ బి.విజయలక్ష్మి



**రాప్తాడు, అంకుశం న్యూస్ జనవరి 26:** భారత రాజ్యాంగం ద్వారా ప్రసాదించబడిన సంక్షేమ ఫలాలను అక్కడ వర్గాల వారికి చేరవేసే బాధ్యతను కలిసికట్టుగా నెరవేరుద్దామని ఎంపీడీఓ బి.విజయలక్ష్మి అన్నారు. రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓలు అశోక్ బాబు, అచ్యుతానందబాబు, ఏఓ భానురేఖ, ఎంఈఓతోపాటు సిబ్బందితోపాటు పాల్గొని ఎంపీడీఓ జెండా ఎగురవేశారు. డాక్టర్ అంబేద్కర్ నేతృత్వంలోని రాజ్యాంగ సభ మనకు ఇచ్చిన రాజ్యాంగం.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి పునాదులు వేసింది. ప్రతిఒక్కరూ రాజ్యాంగ విలువలు కాపాడాలని, ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని కోరారు. అదేవిధంగా డీఎస్పీ కార్యాలయంలో సిబ్బంది, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బి. విజయకుమారి, సీఐ శ్రీహర్ష, వెటర్నరీ డాక్టర్ ప్రకాష్, పీ. హెచ్. సీలో డాక్టర్ శివకృష్ణ, లైబ్రేరియన్ వీరనారాయణరెడ్డి, ఏఓ కృష్ణచైతన్య, విద్యుత్ ఏఈ గౌస్ మొహిద్దీన్, హౌసింగ్ ఏఈ లావణ్య ఆయా కార్యాలయాల్లో మువ్వన్నెల జెండాను ఎగరవేసి వందనం స్వీకరించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ ఆయా హెచ్ఎంలు పేరెంట్స్ కమిటీ చైర్మన్ లు జాతీయ జెండాను ఎగరవేశారు.

## ధర్మవరం తహసీల్దార్ సురేష్ బాబు కు ఉత్తమ అవార్డు



భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రభుత్వ ప్రశంస అవార్డును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్న ధర్మవరం తాసిల్దార్ సురేష్ బాబు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తో పాటు జిల్లా ఎస్పీ కూడా హాజరు కావడం జరిగింది. వీరికి ఉత్తమ అవార్డు లభించడం పట్ల వి ఆర్ ఓ రవిశేఖర్ రెడ్డి తదితరులు రెవిన్యూ బృందం ధర్మవరం తహసీల్దార్ సురేష్ బాబు కు ప్రత్యేక అభినందనలు తెలియజేసారు.

# రోడ్డు మార్జిన్ ను ఆక్రమించి కంచె

- గ్రామ బొడ్డు రాయిని సైతం వదలని ఆక్రమణదారుడు
- అధికారులు పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తుల వినతి
- ఆక్రమణదారుని పై కన్నెర్ర చేసిన మాజీ ప్రజా ప్రతినిధులు బైరెడ్డి, దారపనేని





**కనిగిరి జనవరి 26 అంకుశం న్యూస్:** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలోని తూర్పు కోడిగుడ్లపాడు పంచాయతీ పరిధిలో గల పోతవరం గ్రామ రహదారిని వైసీపీకి చెందిన చెనికల మాల్యాద్రి గ్రామ రహదారిని, గ్రామ బొడ్డు రాయిని సైతం యదేచ్ఛగా ఆక్రమించి ఇనుప కంచె వేసి గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేయడం పట్ల కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఈ రహదారిని 2009-14వ సంవత్సరంలో అప్పటి, ప్రస్తుత శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, అప్పటి ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ 5 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసి మెటల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. 2014-19వ సంవత్సరంలో 2 కోట్ల రూపాయల నిధులతో అధికారుల పర్యవేక్షణలో 20 అడుగుల మేర రోడ్డును విస్తీర్ణం చేసి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. 2023లో గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు చెనికల మాల్యాద్రి గ్రామ రహదారిని, గ్రామ దేవత బొడ్డురాయిని 10 అడుగుల మేర ఆక్రమించి కంచె వేశారు. ఇదేమి విడ్డూరమని గ్రామస్తులు ప్రశ్నించగా మీ దిక్కున్న వారికి చెప్పుకోమని ఆక్రమణదారుడు సమాధానమిస్తున్నాడని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయంపై ఫిబ్రవరి 2వ తేదీన కొత్తగా ఏర్పాటు అయిన మార్కాపురం జిల్లా కలెక్టర్ వారికి గ్రామస్తులతో కలిసి గ్రీవెన్స్ లో అర్జీ ఇవ్వటం జరుగుతుందని దారపనేని, బైరెడ్డి తెలిపారు. గ్రామానికి సంబంధించిన రైతు కూండ్ల వెంకటస్వామి మాట్లాడుతూ సర్వేనెంబర్ 86 లో తాను ఐదు ఎకరాల సెటిల్ మెంట్ భూమిని కొనుగోలు చేసి సాగు చేస్తున్నానని అయితే అసైన్మెంట్ ఆక్రమణదారుడు చెనికల మాల్యాద్రి పొలంలోకి వెళ్లేందుకు దారి లేకుండా ఇబ్బంది పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆక్రమణలపై గతంలో పలుమార్లు అధికారులకు అర్జీలు పెట్టిన స్పందన లేదని ప్రస్తుత అధికారులు స్పందించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# చంద్రన్న నాయకత్వంలో రాష్ట్రం రంగాల్లో అభివృద్ధి

- టిడిపి కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలులి
- జాతీయ జెండా ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు
- టిడిపి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్న పూల నాగరాజు





**అంకుశం న్యూస్ అనంతపురం జనవరి 26:** సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారనిముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరింత ముందుకెళుతోందని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పూల నాగరాజు తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ స్వాతంత్రం రావడం కోసం ఎంతోమంది త్యాగధనుల పోరాట ఫలితమే అన్నారు. ఎంతమంది దేశ నాయకులు వారి ప్రాణాలను త్యాగం చేసి మనకు స్వాతంత్రాన్ని అందించారన్నారు. వారి ఆశయస్ఫూర్తితోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లు ఆంధ్ర రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సరిపూటి సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అర్షదుల్లా, జిల్లా టిడిపి కమిటీ సభ్యులు కృష్ణ కుమార్, తాజుద్దీన్, భూలక్ష్మి, దగ్గర కుమారస్వామి నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, టిడిపి సీనియర్ నాయకుడు సింగవరం రవి, డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, టిడిపి నాయకులు సరిపుటి రమణ, మణికంఠ బాబు, లక్ష్మీ ప్రసాద్, కురుబ నారాయణస్వామి, చెక్కా నాగేంద్ర, లక్ష్మినాయుడమ్మ, చరిత, డిష్ ప్రకాశ్, ఈడిగ నాగభూషణం, శ్రీనివాస్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దేశ అత్యున్నత చట్టం మన రాజ్యాంగం

**-సర్పంచ్ యనమల సుధాకర్**



**.పోరుమామిళ్ల, జనవరి 26(అంకుశం పత్రిక):** స్థానిక మేజర్ పంచాయితీ కార్యాలయ ఆవరణలో సోమవారం 77వ ఘన తంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా మేజర్ పంచాయితీ సర్పంచ్ యనమల సుధాకర్ మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పంచాయితీ కార్యాలయం ఆవరణలోవున్న గాంధీ బొమ్మ విగ్రహానికి, మెయిన్ రోడ్ లో వున్న విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజలందరికీ ఘనతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుధాకర్ మాట్లాడుతూ...1947 ఆగస్ట్ 15న మనకు స్వాతంత్రం వచ్చినప్పటికీ మనకు స్వంత రాజ్యాంగం లేదని తెలిపారు. బాబాసాహెబ్ బీంరావ్ అంబేద్కర్ రాజ్యాంగ పితామహుడు అన్నారు. అంబేద్కర్ అధ్యక్షతన భారత రాజ్యాంగ రూపకల్పనకు 2సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టింది అని గుర్తుచేశారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు జనవరి 26 ను మనం గణతంత్ర దినోత్సవంగా, జాతీయ పండుగగా జరుపుకుంటున్నాం అన్నారు. రాజ్యాంగం భరతదేశ అత్యున్నత చట్టం అని మనమందరం దీని గౌరవించాలని అన్నారు. స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన మన వీరులను కూడా మనం గుర్తుచేసుకొని గౌరవించు కోవలసిన రోజు అన్నారు. ఈ కార్యక్రమంలో షరీఫ్, రామసుబ్బారావు,బీజ్జే బాషా, కల్వకూరి రమణ, అతికారి రాజా, రమణ, దర్వేష్, జూనియర్ అసిస్టెంట్ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## టీడీపీ ప్రభుత్వంతోనే రాజ్యాంగ ఫలాలు



**రాప్తాడు అంకుశం న్యూస్ జనవరి 26:** టిడిపి ప్రభుత్వం అర్హులైన ప్రజలకు రాజ్యాంగానికి అనుగుణంగా సంక్షేమ ఫలాలు సీఎం చంద్రబాబు అందజేస్తున్నారని మండల కన్వీనర్ పంపు కొండప్ప అన్నారు. రాప్తాడు టీడీపీ కార్యాలయంలో 77వ గణతంత్ర వేడుకల సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకే తిరుపాలు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గంగలకుంట కృష్ణ, మాజీ కన్వీనర్ సాకే నారాయణస్వామి, సాకే జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో సేవ చేయాలి

- జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన లిజిల్లా ఎస్పీ పి.జగదీష్





**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం జనవరి 26 :**స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో పోలీస్ శాఖలో ప్రతి ఒక్కరూ పనిచేయాలని ప్రజా సమస్యలు పరిష్కారంలో ఎప్పటికప్పుడు కృషి చేయాలని అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ అన్నారు అనంతపురం జిల్లా అనంతపురం నగరంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు. జాతీయ గీతాన్ని ఆలపించారుఈ సందర్భంగా. జిల్లా ఎస్పీ పి జగదీష్.. పోలీసు సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి స్వీట్స్ పంపిణీ చేశారు.ఈ వేడుకల్లో ఎస్పీ సి.ఐ లు ధరణీకిశోర్, క్రాంతికుమార్ , ఎస్పీ సి.సి ఆంజనేయప్రసాద్, ఎస్సై వెంకటక్రిష్ణ మరియు జిల్లా స్పెషల్ బ్రాంచి & క్యాంప్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనంత లో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

- : జాతీయ పతాకావిష్కరణ చేసిన ఇంచార్జి జిల్లా కలెక్టర్ సి.విష్ణు చరణ్





**అంకుశం న్యూస్ అనంతపురం, జనవరి 26 :** అనంతపురం జిల్లా అనంతపురం నగరంలోని అనంతపురం కలెక్టరేట్ లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ సి.విష్ణు చరణ్ జాతీయ పతాకావిష్కరణ చేసి, జాతీయ గీతాలాపన చేశారు. అనంతరం పోలీసులు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తదనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఇంచార్జి జిల్లా కలెక్టర్ ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఓ ఎ.మాలోల, కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, వివిధ విభాగాల సూపరింటెండెంట్ లు వసంతలత, రియాజుద్దీన్, యుగేశ్వరి దేవి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ శరత్ చంద్రకు ప్రశంశా పత్రం



**పోరుమామిళ్ల /బద్వేల్, జనవరి 26(అంకుశం పత్రిక):** బద్వేల్ పట్టణంలోని గాంధీ నగర్ యుపిహెచ్సి ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ చంద్ర తను అందించిన వైద్యసేవలకు గుర్తింపుగా ప్రభుత్వం నుంచి ప్రశంశా పత్రం దక్కించుకున్నారు. 77 వ ఘనతంత్ర దినోత్సవం సందర్బంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు చేతులమీదుగా ఉత్తమ వైద్య అధికారిగా ప్రశంశా పత్రం, అవార్డును అందుకున్నారు. డాక్టర్ శరత్ చంద్రను డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది, కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.ద

## ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో గణతంత్ర దినోత్సవం



**అంకుశం న్యూస్ ధర్మవరం జనవరి 26:** ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో సోమవారం గణ తంత్ర దినోత్సవం సందర్బంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ మతి ఎమ్. వనిత వాణి త్రివర్ణ పతాకం ఎగురవేశారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ దేశం కోసం త్యాగం చేసిన మహనీయుల సేవలు స్వాతంత్ర్య దేశ భక్తి మరువరాధన్నారు. ఈ కార్యక్రమం లో అధ్యాపకులు మల్లికార్జున, ప్రభాకర్, పెద్దన్న, రామాంజులు రెడ్డి,పద్మజ, సునీత,మునిస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు

## ధర్మవరంఆర్.డి.వో. ఏ. మహేష్ కు గణతంత్ర దినోత్సవ ఉత్తమ అవార్డు!



**అంకుశం న్యూస్ ధర్మవరం జనవరి 26:** భారత గణతంత్ర దినోత్సవం సందర్బంగా ఉత్తమ ప్రభుత్వ ప్రశంస అవార్డును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా. జిల్లా ఎస్ పి సమక్షంలో ప్రభుత్వ ప్రశంస పత్రాన్ని అందుకున్న ధర్మవరం ఆర్. డి. వో. ఏ. మహేష్ ను స్థానిక రెవిన్యూ సిబ్బంది పలువురు అభినందించారు కార్యక్రమంలోఆర్ డివో రెవిన్యూ బృందం ధర్మవరం తహసీల్దార్ సురేష్ బాబు కు ప్రత్యేక అభినందనలు తెలియజేసారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

- కౌకుంట్లలో మంత్రి పయ్యావుల కేశవ్ పిజిఆర్ఎస్ స్వీకరణలి
- : ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన మంత్రి
- : రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశం





**అంకుశం న్యూస్ అనంతపురం, జనవరి 26 :** అనంతపురం జిల్లాలిఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని ఉరవకొండ మండలం కౌకుంట్ల గ్రామంలోని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యుల క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల సమస్యలపై మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేసిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కరమే లక్ష్యంగా తమకూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. తమ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు నలుమూలల నుంచి వచ్చిన బాధితులు, నాయకులు, ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించడం జరిగిందని, ఎలాంటి ఆలస్యం కాకుండా ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

# డాక్టర్ ప్రసాద్ జయంతి సందర్భంగా అన్నదానం



**.పోరుమామిళ్ల, జనవరి 26(అంకుశం పత్రిక ):**ఎస్వీ ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత మాజీ ఆప్కాస్ రాష్ట్ర బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి తన తండ్రి ఎస్వీ ప్రసాద్ 78వ జయంతిని పురస్కరించుకొని పోరుమామిళ్ల పట్టణంలోని మదర్ థెరిస్సా అనాధ శరణాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ వున్న పిల్లలకు చదువు ప్రాముఖ్యతను, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనాధ శరణాలయం ఫౌండర్ సర్పంచ్ చిత్త రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ...డా క్టర్ ప్రసాద్ చుట్టు ప్రక్కల మండలాల ప్రజలకు ఎనలేని వైద్యసేవలు అందించారని అలాగే పోరుమామిళ్ల సర్పంచ్ గా కూడా విశిష్ట సేవలు అందించి ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోయారని, ప్రస్తుతం మన మధ్యలో లేకపోవడం తీరనిలోటని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బాష, రాజశేఖర్, గిరి ప్రణీత్ రెడ్డి, టీచర్ ప్రసాద్, వార్డు మెంబెర్ సురేష్, ప్రసాద్, శ్రీధర్,బండి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.